
సాక్షి
పల్నాడు
బుధవారం, 6, మార్చి, 2024



వీరమ్మతల్లికి జేజేలు

ఉయ్యూరు: ఉయ్యూరు వీరమ్మతల్లి తిరునాళ్ల సోమవారం రాత్రి ముగిసింది. అమ్మవారు మెట్టినింట ప్రవేశించి ప్రత్యేక పూజలందుకున్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 515.20 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 450 క్యూసెక్కులు విడుదలవుతోంది.

ప్రసన్నాంజనేయస్వామికి నాగవల్లీ దళార్చన



యడ్లపాడు: సొలస గ్రామంలోని ప్రసన్నాంజనేయస్వామికి మంగళవారం పంచామృత అభిషేకం, నాగవల్లీ పత్రాలతో పూజలు చేశారు.

న్యూస్‌రీల్

నృసింహుని మాలధారులకు వస్త్రాలు అందజేత

మంగళగిరి: నగరంలోని పానకాల లక్ష్మీ నృసింహస్వామి ఆలయం ఆవరణలో శ్రీలక్ష్మీ నృసింహస్వామి మాలధారులకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) మంగళవారం వస్త్రాలను అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత 16 సంవత్సరాలుగా శ్రీలక్ష్మీ నృసింహస్వామి మాలధారులకు వస్త్రదానం, అన్నదానం చేస్తున్న తోట శ్రీనివాస్ యాదవ్ మిత్ర బృందం అభినందనీయులన్నారు. ప్రతి సంవత్సరం సుమారు 150 మంది మాలధారులకు వస్త్రదానం చేయడం విశేషమన్నారు. దేవస్థాన ఏసీ ఎ.రామకోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మల్లన్న తలపాగా ఊరేగింపు




వేటపాలెం: పందిళ్లపల్లిలో మహాశివరాత్రి పండుగ సందర్భంగా తయారు చేసిన శ్రీశైల మల్లన్న తలపాగాకు మంగళవారం వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. శ్రీగంగా పార్వతీ సమేత పునుగు రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో దేవాంగ శివస్వాములు నియమనిష్ఠలతో ఆచార సంప్రదాయాలతో శ్రీశైల మల్లన్న తలపాగాను 40 రోజులు శివమాల దీక్షలో ఉంచి చేతి మగ్గం మీద తయారు చేశారు. దేవాంగపురి పంచాయతీ హస్తినాపురం గ్రామస్తులు పృథ్వీ వెంకటేశ్వర్లు కుమారులు వెంకట సుబ్బారావు ఆశీస్సులతో తలపాగా తయారు చేశారని శివమాల దీక్ష స్వాములు తెలిపారు. ఈగ్రామోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కోలాట ప్రదర్శనలు, బాణాసంచాలతో గ్రామ వీధుల్లో తలపాగా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న సంతర్పణ గావించారు. దేవాంగ సంక్షేమ సంఘం నాయకులు బండ్ల తిరుమలాదేవి, గుత్తి విశ్వేశ్వరరావు, సత్రం మల్లేశ్వరావు, బీరక సురేంద్ర పాల్గొన్నారు.

భరతనాట్యం చేస్తూ గిరి ప్రదక్షిణ



నరసరావుపేట రూరల్: భరతనాట్యం చేస్తూ కళాకారుడు కోటప్పకొండ గిరిప్రదక్షిణను పూర్తిచేశాడు. లోక కల్యాణార్థం, త్రికోటేశ్వరుడు కటాక్షించాలని, సంస్కృత భాషను అభివృద్ధి చేయాలని ఆకాంక్షిస్తూ కోటప్పకొండ శ్రీ వెంకటేశ్వర వేద విజ్ఞాన పీఠం అధ్యాపకుడు పి.కృష్ణవాసు శ్రీకాంత్ గిరి ప్రదక్షిణను నిర్వహించాడు. అన్నమాచార్య కీర్తనలకు భరతనాట్యంతో 14 కిలోమీటర్ల గిరిప్రదక్షిణను గంటన్నరలో పూర్తిచేశాడు. త్రికోటేశ్వరుని శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని స్వామివారికి నృత్యనీరాజనం సమర్పించినట్టు కృష్ణవాసు శ్రీకాంత్ తెలిపారు.

యార్డుకు 1,28,440 బస్తాల మిర్చి



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 1,28,440 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,20,429 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ. 20,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి 21,500 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.12,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 1,03,461 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు.

విజయఢంకా మోగిద్దాం



సంఘీభావం తెలుపుతున్న అనిల్‌కుమార్ యాదవ్, మర్రి రాజశేఖర్, మల్లెల రాజేష్‌నాయుడు



చిలకలూరిపేట పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

- ఏడు అసెంబ్లీ స్థానాల్లో అత్యధిక మెజార్టీ సాధించేలా కృషిచేయాలి
- నిస్వార్థంగా పనిచేసే వారికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది
- వైఎస్సార్ సీపీ లోక్‌సభ సమన్వయకర్త పి.అనిల్‌కుమార్ యాదవ్
- చిలకలూరిపేటలో ముఖ్యనాయకుల, ప్రజాప్రతినిధుల ఆత్మీయ సమావేశం
- జగనన్న ప్రభుత్వంలో జరిగిన మంచిని ప్రజలకు చెప్పండి : ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్
- సిద్ధం సభకు లక్షలాదిగా తరలిరావాలి : సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు

చిలకలూరిపేట: గెలుపే పరమావధిగా రానున్న ఎన్నికలకు సంసిద్ధమై, విజయఢంకా మోగిద్దామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నరసరావుపేట లోక్‌సభ సమన్వయకర్త డాక్టర్ పి.అనిల్ కుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధుల ఆత్మీయ సమావేశం పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆర్య వైశ్య కల్యాణ మండపంలో మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్‌లు హాజరయ్యారు. పార్టీ చిలకలూరిపేట నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు అధ్యక్షత వహించారు.

జగనన్న మళ్లీ సీఎం కావాలన్నదే అందరి లక్ష్యం..

అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలన్న ఒకే ఒక్క లక్ష్యంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని కోరారు. నరసరావుపేట లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాలను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని, ఇందుకోసం ప్రతి సీటు ఎంతో విలువైనదిగా భావించి కష్టించి పనిచేయాలన్నారు. నిస్వార్థంగా పనిచేసే వారికి పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని, జెండాలు మోసేవారే అసలైన నాయకులని పేర్కొన్నారు. ప్రతి ఒక్క నాయకుడికి, కార్యకర్తకు సముచిత స్థానం, గౌరవం కల్పిస్తామని చెప్పారు. నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి మంచి మెజార్టీతో విజయం సాధిద్దామని వెల్లడించారు.

- నియోజకవర్గ పరిశీలకుడు చిట్టా విజయభాస్కరరెడ్డి మాట్లాడుతూ మల్లెల రాజేష్‌నాయుడు, అనిల్‌కుమార్ యాదవ్‌లను అత్యధిక మెజార్టీతో గెలుపించుకోవడం ద్వారా మరోమారు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకుందామని చెప్పారు. కార్యక్రమంలో వడ్డెర కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఎస్.గాయత్రీ సంతోషిణి, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ వర్ల నారాయణ, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫానీ, వైస్ చైర్మన్లు కొలిశెట్టి శ్రీనివాసరావు, వలేటి వెంకటేశ్వరరావు, ఎంపీపీలు దేవినేని శంకరరావు, పిడతల ఝాన్సీ, తలతోటి రాణి, జెడ్పీటీసీ సభ్యులు కోడె సుధారాణి, కాట్రగడ్డ మస్తాన్‌రావు, ముక్తా వాసు, పార్టీ పట్టణ అధ్యక్షులు క్లస్టర్–1 పఠాన్ తలహాఖాన్, క్లస్టర్ –2 విడదల కమలేంద్ర, పార్టీ చిలకలూరిపేట, నాదెండ్ల, యడ్లపాడు మండలాల అధ్యక్షులు గుత్తా యాములయ్య, మద్దూరి కోటిరెడ్డి, ఘంటా శంకర్, పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి షేక్ అల్లీమియా, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చల్లా యజ్ఞేశ్వరరెడ్డి, పార్టీ వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

ప్రజల్లోకి వెళ్లాలి...

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల కాలంలో మంచి పాలన అందించారని, ప్రజలకు అద్భుతమైన లబ్ధి చేకూరిందని ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ చెప్పారు. వైఎస్సార్ సీపీ పాలనలో లబ్ధి పొందని కుటుంబం అంటూ లేదని వెల్లడించారు. అనిల్‌కుమార్ యాదవ్ జగన్ సైనికుడని సీఎం జగన్ ఆదేశాల మేరకు ఎంపీగా పోటీ చేసేందుకు ఇక్కడికి వచ్చారని వెల్లడించారు. అదే విధంగా నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు గ్రామ గ్రామాన తిరుగుతూ కష్ట పడుతున్నారని, ఈ ఇరువురి విజయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పాటుపడాలన్నారు.

– మర్రి రాజశేఖర్, ఎమ్మెల్సీ

సిద్ధం సభను విజయవంతం చేద్దాం

చిలకలూరిపేట నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీన మేదరమెట్ల సమీపంలో నిర్వహిస్తున్న నాలుగో సిద్ధం సభను విజయవంతం చేద్దామని పిలుపు నిచ్చారు. లక్షలాది మందితో నిర్వహించే సిద్ధం సభకు అన్ని నియోజకవర్గాల కంటే చిలకలూరిపేట నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో హాజరవుదామని పేర్కొన్నారు. పార్టీకి సుశిక్షితుడైన సైనికుడిలా పనిచేసే అనిల్ కుమార్ యాదవ్‌కు నియోజకవర్గం నుంచి వచ్చే ఎన్నికల్లో అత్యధిక మెజార్టీ సాధించిపెడదామని తెలిపారు.

– మల్లెల రాజేష్‌నాయుడు

అమరేశ్వరుడు పెండ్లికొడుకాయెనే..!



అమరేశ్వరుడిని పెండ్లికుమారునిగా చేస్తున్న దృశ్యం

అమరావతి: ప్రముఖ పుణ్యక్షేత్రం అమరావతిలో వేంచేసియున్న బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి వారి దేవస్థానంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం అర్చకులు అమరేశ్వరుడిని పెండ్లి కుమారుని చేశారు. మహాశివరాత్రి కల్యాణ మహోత్సవాలు బాలచాముండికా సమేత అమరేశ్వరుడిని పెండ్లికుమారుని చేయటంతో ప్రారంభమయ్యాయి. తొలుత ఆలయ అనువంశిక ధర్మకర్త, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ రాజావాసిరెడ్డి మురళీకృష్ణ ప్రసాద్ తరపున పీసపాటి అమరేశ్వరశర్మ స్వామివారికి భాజాబజంత్రీలతో ఊరేగింపుగా వచ్చి కల్యాణోత్సవ వస్త్రాలను సమర్పించారు. ఈ క్రమంలో అమరేశ్వర స్వామి వారికి వేకువజామున అభిషేకం నిర్వహించి నూతన వస్త్రధారణతో పెండ్లికుమారుని చేశారు. శోభకృతనామ సంవత్సర మాఘ బహుళ దశమి నుంచి ఫాల్గుణ శుద్ధ పాడ్యమి వరకు పాంచాహ్నిక దీక్షతో నిర్వహించే ఈ కల్యాణోత్సవాలకు అర్చకులకు ఆలయ కార్యనిర్వాహణాధికారి వేమూరి గోపినాధశర్మ దీక్షా వస్త్రాలను అందించారు. అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలలో నేడు..

మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా కల్యాణోత్సవ కార్యక్రమాలలో భాగంగా బుధవారం విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచన, రక్షాబంధనం, వాస్తుపూజ, వాస్తు హోమం, పర్యగ్నీకరణం, మృత్సంగ్రహణ, అంకురారోపణ, అగ్నిప్రతిష్టాపన, ధ్వజారోహణ కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ స్థానాచార్యుడు కౌశిక చంద్రశేఖరశర్మ తెలిపారు.

సమష్టిగా విజయవంతం చేద్దాం



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి, చిత్రంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, జేసీ శ్యామ్‌ప్రసాద్ , తదితరులు

- జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి
- ఎమ్మెల్యే గోపిరెడ్డి, ఎస్పీ, జేసీలతో కలిసి కోటప్పకొండ తిరునాళ్ల ఏర్పాట్లపై సమీక్ష

నరసరావుపేట రూరల్: కోటప్పకొండ తిరునాళ్లను అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో విజయవంతం చేద్దామని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని ఈనెల 8వ తేదీన కోటప్పకొండలో నిర్వహించే తిరునాళ్ల మహోత్సవంపై మంగళవారం ఆలయ ప్రాంగణంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త రామకృష్ణ కొండలరావు, డీఆర్‌ఓ వినాయకం, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణరెడ్డి, డీఎఫ్‌ఓ రామచంద్రరావులు పాల్గొన్నారు. తిరునాళ్ల ఏర్పాట్లను శాఖల వారీగా కలెక్టర్ శివశంకర్, సమీక్షించారు. స్వామివారి దర్శనం కోసం వీఐపీలకు ఇచ్చే పాస్‌లతో పాటు డ్యూటీపాస్‌లను రెవెన్యూ శాఖ అందజేస్తుందని కలెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ 3వేల మంది పోలీసు అధికారులు, సిబ్బంది విధుల్లో పాల్గొంటారని తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రత్యేక బందోబస్తును ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని మెరుగ్గా ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. యల్లమంద, పెట్లూరివారిపాలెం రోడ్డును కొండకు చేరుకునేందుకు, జేఎన్‌టీయూ–ఎన్ కళాశాల రోడ్డును తిరుగు ప్రయాణానికి వినియోగించుకోవాలని తెలిపారు. ఈ ఏడాది దాదాపు 25లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నట్టు తెలిపారు. ఆర్డీఓ సరోజిని, డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ, ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ పి.చిట్టిబాబు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి వైభవంగా మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు

- 12వ తేదీ వరకు నిర్వహణ
- 8న జరిగే శివపార్వతుల కల్యాణ మహోత్సవానికి భారీ ఏర్పాట్లు
- క్యూలైన్లు, పందిళ్లు, ప్రత్యేక అలంకరణలతో కళకళలాడుతున్న పెదకాకాని శివాలయం

బ్రహ్మోత్సవ సందడి



విద్యుద్దీప కాంతుల్లో ధగధగలాడుతున్న పెదకాకాని శివాలయం

పెదకాకాని: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెదకాకాని భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 6వ తేదీనుంచి మహా శివరాత్రి కల్యాణ బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభం కానున్నాయి. ఈ ఉత్సవాల నిర్వహణలో భాగంగా ఇప్పటికే శివాలయంలో భారీ ఏర్పాట్లు చేపట్టారు. భ్రమరాంబ మల్లేశ్వర స్వామివారి ఆలయం ప్రాంగణం రంగు రంగుల పందిళ్లు, తోరణాలతో కళకళలాడిపోతుంది. జిల్లా నలుమూలల నుంచే కాకుండా అనేక ప్రాంతాల నుంచి తరలివస్తున్న భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశారు. స్వామివారిని దర్శించుకునే విధంగా ప్రత్యేక క్యూలైన్లు ఉన్నాయి. ఉత్సవాలు ఈనెల 6వ తేదీ నుంచి 12 వరకు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపట్టారు. బ్రహ్మోత్సవాల ప్రారంభం పురస్కరించుకుని మాఘ బహుళ ఏకాదశి పూర్వాషాఢ నక్షత్రం బుధవారం రోజున అమ్మవారు భ్రమరాంబ దేవిగా భక్తులను అనుగ్రహిస్తారు. ప్రత్యేక వేదికపై భ్రమరాంబ అమ్మవారిని పెండ్లి కుమార్తెగా, మల్లేశ్వర స్వామిని పెండ్లికుమారుడిగా అలంకరించడం జరుగుతుందని ఆలయ డిప్యూటీ కమిషనర్ దాసర శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. దాతల సహకారంతో అన్న సంతర్పణ, క్యూలైన్‌లలో మజ్జిగ, వాటర్ పంపిణీ, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పార్కింగ్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. అలాగే ఈ ఏడాది స్వామివారి కల్యాణ ఏర్పాట్లను ఆలయ ప్రాంగణంలోని ఓపెన్ ప్రదేశంలో వేదిక ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతిరోజూ రాత్రిళ్లు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

8న శివపార్వతుల కల్యాణం..

ఉత్సవాలలో రెండవరోజు గురువారం భ్రమరాంబ అమ్మవారు వనదుర్గాదేవి అలంకారంలో భక్తులను అనుగ్రహిస్తారు. ప్రత్యేక వేదికపై రామలింగ ప్రతిష్ట ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. 8వ తేదీన భ్రమరాంబ అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు అనంతరం, ప్రత్యేక వేదికపై రాత్రి 2 గంటలకు శివపార్వతుల కల్యాణం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. 9వ తేదీన బాలాత్రిపురసుందరీదేవిగా అమ్మవారు భక్తులను అనుగ్రహిస్తారు. ప్రత్యేక వేదికపై కైలాసగిరి అలంకరణ జరుగుతుందన్నారు. 10వ తేదీన అమ్మవారిని అన్నపూర్ణా దేవిగా అలంకరించడం, ప్రత్యేక వేదికపై భక్తమార్కండేయగా అలంకరించడం జరుగుతుందన్నారు. సాయంత్రం 4 గంటలకు భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వార్ల దివ్య రథోత్సవం అత్యంత వైభవంగా జరుగుతుందన్నారు. 11వ తేదిన రాజరాజేశ్వరిదేవిగా భ్రమరాంబ అమ్మవారు భక్తులను అనుగ్రహిస్తారు. ప్రత్యేక వేదికపై త్రిమూర్తులను అలంకరించడం జరుగుతుంది. సాయంత్రం 4 గంటలకు తెప్పోత్సవం, పంచ హారతులు అత్యంత వైభవంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. మార్చి 12వ తేదీన పుష్పశయ్య అలంకరణ, ప్రత్యేక వేదికపై డోలికా గణపతి ఏర్పాటు, పుష్పశయనోత్సవాలు, ఫలప్రదానములు సాంప్రదాయబద్ధంగా జరుగుతాయని ఏసీ వివరించారు. కల్యాణం రోజున ఆలయ పునఃనిర్మాణ దాతలు కొల్లిపర వంశస్తులచే భ్రమరాంబ మల్లేశ్వరస్వామివారికి నూతన పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించడం జరుగుతుందని ఆలయ డిప్యూటీ కమిషనర్ దాసర శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు.

విశ్వాస ఘాతకులను ఓడించండి

- ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు
- లంకెలకూరపాడులో వైఎస్సార్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్, మల్టీపర్పస్ గోడౌన్ ప్రారంభం



లంకెలకూరపాడులో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

లంకెలకూరపాడు(ముప్పాళ్ళ): రాష్ట్రంలో ఐదేళ్లపాటు న్యాయబద్ధంగా, సుభిక్షంగా పరిపాలన చేశామని, రానున్న ఎన్నికల్లో పార్టీలు మారే విశ్వాసఘాతుకులను ఓడించాలని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు పిలుపునిచ్చారు. మండలంలోని లంకెలకూరపాడు గ్రామంలో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను, సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన మల్టీపర్పస్ గోదామును మంత్రి అంబటి మంగళవారం ప్రారంభించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చలువతో ఎంపీగా గెలిచింది ఒకరైతే, నాలుగు పార్టీలు మారిన వ్యక్తి మరొకరని, ఇలా రోజుకో పార్టీ మారే వారిని గెలిపించటం ధర్మమేనా అని ప్రశ్నించారు. మోసపూరిత హామీలతో రైతు ఆర్థికంగా చితికి పోయే స్థితికి చంద్రబాబు తీసుకొచ్చిన సంగతి గుర్తు చేసుకోవాలన్నారు. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని చెప్పారు. గత చంద్రబాబు పాలనకు, నేటి జగన్‌మోహన్ రెడ్డి పాలనకు బేరీజు వేసుకోవాలన్నారు. డ్వాక్రా మహిళలకు ఇచ్చిన మాట ప్రకారం ఇప్పటికీ మూడుసార్లు సాయం అందించారని, మరోసారి కూడా అందించే తీరుతామన్నారు. రాష్ట్రంలో ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చి ఓటు అడుగుతున్నామన్నారు. రెండు లక్షల డెబ్బయి వేల కోట్ల రూపాయలు నేరుగా మీ ఖాతాల్లోనే పార్టీలకతీతంగా జమ చేశారన్నారు. టీడీపీ వారు కూడా ఆలోచించుకోవాలన్నారు. ఓటు అడిగే హక్కు ఒక్క జగన్‌మోహన్‌రెడ్డికే ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు న్యాయం చేద్దామని భావించి వైఎస్సార్ సీపీ తరఫున అనిల్‌కుమార్ యాదవ్‌కు అవకాశం కల్పించారన్నారు. రానున్న ఎన్నికల్లో విశ్వాసఘాతకులను ఓడించాలని పిలుపునిచ్చారు. విశ్వాసపాత్రులైన అనిల్‌కుమార్ యాదవ్‌ను, తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. గత ఎన్నికల్లో లంకెలకూరపాడు గ్రామం కాంగ్రెస్‌కు కంచుకోట అయితే వైఎస్సార్ సీపీ వచ్చాక వైఎస్సార్ సీపీకి కంచుకోటగా మారిందన్నారు. గుంటూరు మిర్చియార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, సత్తెనపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబురావు, పి.రత్నాకర్, పల్నాడు జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ గీతా హాసంతి, పక్కాల సూరిబాబు, సర్పంచ్ వెంకట రమణారెడ్డి, ఎంజీఎం రామలింగారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నక్కా శ్రీనివాసరావు, రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహా రుద్రాయా.. మహా లింగాయ

18 అడుగుల భారీ శివలింగం రూపొందించిన తెనాలి శిల్పులు



మహాశివరాత్రి పర్వదినం రోజున బెంగళూరులోని మారతహళ్లిలోని దేవాలయానికి విచ్చేసే లక్షలాది భక్తుల సందర్శనార్థం తెనాలిలో 18 అడుగుల భారీ శివలింగాన్ని రూపొందించారు. దేవాలయ నిర్వాహకుల కోరికపై స్థానిక సూర్యశిల్పశాల శిల్పకారులు, తండ్రీకొడుకులు కాటూరి వెంకటేశ్వరరావు, కాటూరి శ్రీహర్షలు ఫైబర్‌తో ఈ భారీ విగ్రహాన్ని తయారుచేసినట్టు తెలిపారు. ఈ విగ్రహాన్ని బెంగళూరు తరలిస్తున్నట్టు వివరించారు.

– తెనాలి

క్లుప్తంగా

పింఛన్ల పంపిణీ 99శాతం పూర్తి



నరసరావుపేట: జిల్లాలో సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ మంగళవారం నాటికి 99 శాతం పూర్తయింది. జిల్లాలో 2,83,119 మందికి పింఛన్లు అందజేయాల్సివుండగా 2,80,286 మందికి అందజేశారు. వీరికి రూ.83,74,21,000ల సొమ్ము పంపిణీ చేశారు. వలంటీర్లు ప్రతిరోజూ తెల్లవారు జాము నుంచే ఇంటింటికి వెళ్లి పింఛన్లు అందజేశారు. నకరికల్లు గ్రామంలో డీఆర్‌డీఏ పీడీ బాబూనాయక్ పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు.

ఇంటర్ సెకండియర్ పరీక్షకు 427 మంది గైర్హాజర్

సత్తెనపల్లి: జిల్లాలో ఇంటర్ సెకండియర్ పరీక్షకు మంగళవారం 427 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 48 పరీక్ష కేంద్రాల్లో ఇంటర్మీడియెట్ సెకండియర్ ఇంగ్లీష్ పరీక్షకు 12,905 మంది హాజరు కావాల్సి ఉండగా 12,510 మంది హాజరయ్యారు. 395 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌కు 570 మంది హాజరు కావాల్సి ఉండగా 538 మంది హాజరయ్యారు. 32 మంది గైర్హాజరయ్యారు. జిల్లాలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగినట్లు పల్నాడు జిల్లా డీఐఈఓ నీలావతిదేవి తెలిపారు.

ఐతానగర్‌లో వృద్ధుడి హత్య

తెనాలిరూరల్: స్థానిక ఐతానగర్‌లో వృద్ధుడు హత్యకు గురైన ఘటన కలకలం రేకెత్తించింది. లంకదిబ్బ 3వ లైనుకు చెందిన చింతాబత్తుని ఫిలిప్ (60) హత్యకు గురికా వడాన్ని స్థానికులు గుర్తించి టూ టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. తాపీ కార్మికుడైన ఫిలిప్ భార్య గతంలోనే మృతి చెందింది. అతని కుమారుడు కూడా ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుమార్తెకు వివాహం చేయగా ఆమె చీరాలలో ఉంటోంది. ఒంటరిగా నివసిస్తుండే ఫిలిప్‌కు మద్యం అలవాటు ఉంది. మద్యం మత్తులో గతంలో స్థానికులతో స్వల్ప ఘర్షణ లు పడ్డాడు. మంగళవారం ఉదయం లంకదిబ్బ ప్రాంతానికే చెందిన ఓ యువకుడితో ఘర్షణ జరిగినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఆ యువకుడు ఫిలిప్‌పై విచక్షణా రహితంగా దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడని భావిస్తున్నారు.

సిద్ధం సభను విజయవంతం చేద్దాం

- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- జనసమీకరణపై భీమవరంలో నాయకులతో సమీక్ష



భీమవరంలో బుల్లెట్‌పై పర్యటిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: సార్వత్రిక ఎన్నికలకు వైఎస్సార్ సీపీ శ్రేణులను సిద్ధం చేసే క్రమంలో వైఎస్సార్ సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 10వ తేదీ మేదరమెట్ల వద్ద నిర్వహించనున్న సిద్ధం సభను జయప్రదం చేద్దామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పిలుపునిచ్చారు. సత్తెనపల్లి మండలం భీమవరం గ్రామంలో సిద్ధం సభకు జన సమీకరణలో భాగంగా మంగళవారం నాయకులు, కార్యకర్తలతో కలిసి ద్విచక్ర వాహనాలపై గ్రామాన్ని సందర్శించారు. యువకులు, నాయకులు మంత్రి అంబటి రాంబాబు వెంట భారీగా తరలివెళ్లారు. గ్రామంలో మంత్రి అంబటికి జనం నీరాజనం పలికారు. విలక్షణ రాజకీయంతో సరికొత్త కార్యాచరణతో ఆర్భాటాలకు దూరంగా బుల్లెట్ వాహనంపై గ్రామంలోకి రావడంతో వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో కొత్త జోష్ నింపారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ సత్తెనపల్లి నియోజకవర్గం నుంచి ప్రతి కార్యకర్త సిద్ధం సభకు తరలిరావాలని, ఆ బాధ్యత నాయకులు తీసుకోవాలని కోరారు. పట్టణంలోని ప్రతి వార్డుతోపాటు నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి సిద్ధం సభకు తరలివచ్చేలా సమాయత్తం కావాలన్నారు. వైఎస్సార్ సీపీ శ్రేణులను పెద్ద ఎత్తున తరలించి సభను విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త భుజస్కంధాలపై ఉందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ఫలాలను వివరిస్తూ ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి గ్రామంలో సిద్ధం సభ గురించి తెలియ జేయాలన్నారు పార్టీ అభివృద్ధి కార్యకర్తల చేతుల్లోనే ఉందన్నారు. కార్యకర్తలు సైనికులుగా పనిచేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేసేందుకు ప్రయత్నిద్దాం అన్నారు. అందరం కలిసికట్టుగా పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. మన సిద్ధం సభలను చూసి ప్రతిపక్ష పార్టీలు యుద్ధ విరామం ప్రకటించి పారిపోవాలన్నారు. వైఎస్సార్ సీపీకి నాలుగవ సిద్ధం సభ కీలకమని, ఇది రాష్ట్రవ్యాప్తంగా ప్రభావితం చేస్తుందన్నారు. ప్రతి ఒక్క నాయకుడు చిత్తశుద్ధితో సభను విజయవంతం చేయాలన్నారు. ఆయనతోపాటు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబురావు, మున్సిపల్ వైస్ చైర్మన్ రమావత్ కోటేశ్వరరావు నాయక్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి, వ్యవసాయ సలహా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్లం విజయభాస్కర్‌రెడ్డి, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చిలుకా జైపాల్, నాయకులు దామచర్ల లక్ష్మీనారాయణ, పాలేటి పిచ్చయ్య, మానుకొండ భూపతిరావు, దానయ్య, కాటుమాలు డేవిడ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

ఆధునికీకరణ పనులతో ప్రజలకు మేలు

- ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి
- రూ.69లక్షలతో 15 ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు



శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

రెంటచింతల: రెంటచింతలలో చేపట్టిన రూ.3.50 కోట్ల విలువైన 11కె/ఎల్‌టీ అభివృద్ధి పనులతో గ్రామ ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక జాతీయ స్తూపం వద్ద అభివృద్ధి పనుల శిలాఫలకం ఆవిష్కరించి భూమి పూజ చేసి మాట్లాడారు. గ్రామంలో ప్రస్తుతం ఉన్న 30 ట్రాన్స్‌ఫార్మర్ల కారణంగా పలు సమస్యలు ఎదుర్కొంటున్న గ్రామస్తులకు లోవోల్టేజ్ లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు అదనంగా రూ.69 లక్షలతో మరో 15 ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రూ.34.1 లక్షలతో 3.41 కి.మీ నూతన 11కేవీ లైన్‌ను, రూ.72 లక్షలతో 7.2 కి.మీ కొత్త ఎల్‌టీ లైన్‌ను ఏర్పాటు చేయడంతో అంతరాయం లేని నాణ్యమైన నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అవుతుందన్నారు. అభివృద్ధి పనులతో విద్యుత్ నష్టాలు తగ్గించుకోవచ్చని, ప్రమాదాలు నివారించవచ్చని, కుటీర పరిశ్రమల స్థాపన వంటి ఎన్నో ప్రయోజనాలతోపాటు ఎంతో కాలంగా గ్రామ ప్రజలు పడుతున్న సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పేర్ల చౌడమ్మ, డీఈలు జె.హరిబాబు, శ్రీనివాసరావు, ఎంపీపీ పాముల సంపూర్ణమ్మ, మాజీ ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, వైస్ ఎంపీపీ ఏరువ శౌరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు గొట్టం బ్రహ్మారెడ్డి, జేసీఎస్ జిల్లా కన్వీనర్ మోర్త ఉమ, దుర్గి మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ ఆదూరి ఇన్నారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ అల్లం ప్రతాప్‌రెడ్డి, పార్టీ నాయకులు మోదుగు శ్రీనివాసరెడ్డి, పల్లెర్ల కోటిరెడ్డి, తుమ్మా ఇన్నారెడ్డి, పేర్ల ముత్తయ్య, కె.మర్రెడ్డి, మర్రి లూర్ధురాజు, గుజ్జుల సైదారెడ్డి, డేగల సంసోన్, బత్తుల దేవ, ఏపీ ట్రాన్స్‌కో ఏఈ మస్తాన్‌వలి తదితరులున్నారు.

రైతులకు నాణ్యమైన విద్యుత్ అందిస్తాం..

వెల్దుర్తి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం మండలంలోని శిరిగిరిపాడు గ్రామంలో రూ.2.5కోట్లతో చేపట్టే అధునాతన విద్యుత్ లైన్లు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. గ్రామంలో ఉన్న విద్యుత్ లైన్లన్నీ మరమ్మతులకు గురికావటంతో రూ.2.5కోట్ల నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. ఈ పనులను త్వరలోనే పూర్తి చేస్తామని చెప్పారు. గ్రామంలో నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటుతోపాటు కొత్త వైర్లను, 11 పెద్ద ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామంలో లో ఓల్టేజి సమస్య తీరుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ అలుగుమల్లి సంజీవరెడ్డి, గ్రామ సర్పంచ్ సంజీవమ్మ, ఎంపీటీసీ అయ్యన్న, సొసైటీ అధ్యక్షుడు గుంటక పెద చెన్నారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కేతావత్ బాలునాయక్, చపారపు లచ్చిరెడ్డి, సీయోను, భూమిరెడ్డి రామాంజిరెడ్డి, దాసు, వజ్రాల చిన వెంకటరెడ్డి, సబ్బసాని కోటిరెడ్డి, గట్ల మల్లికార్జునరెడ్డి, విద్యుత్ ఈఈ జె హరిబాబు, ఆపరేషన్ ఏఈ ఎస్ శ్రీనివాసరావు, ఏడీఏ రామయ్య, విద్యుత్ శాఖ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు మహానేత వైఎస్సార్



వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

జెట్టిపాలెం(రెంటచింతల): ఇచ్చిన మాట తప్పని మడమ తిప్పని మహానేత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడుగా నిలిచిపోయారని ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని జెట్టిపాలెం గ్రామంలో ఏర్పాటుచేసిన వైఎస్సార్ విగ్రహాన్ని పిన్నెల్లి మంగళవారం ఆవిష్కరించి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు అమలుచేసిన ఆరోగ్యశ్రీ, రైతన్నల శ్రేయస్సు కోసం సాగునీటి సమస్య లేకుండా చేసేందుకు జలయజ్ఞం పథకం కింద చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులను రాష్ట్ర ప్రజానీకం ఎప్పటికీ మరువరన్నారు. ముందుగా రూ.4.50 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను, రూ.20.80 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ గ్రామీణ ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు వలన మండలంలోని జెట్టిపాలెం, గోలి, మల్లవరం, సత్రశాల గ్రామాల్లోని నివాసాలకు, పశర్లపాడు పంట పొలాల్లోని వ్యవసాయ విద్యుత్ మోటర్లకు లోవోల్టేజ్ లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ దావులూరి నాగమ్మ, జెడ్పీ వైస్ చైర్మన్ శౌంతిరెడ్డి నర్శిరెడ్డి, ఎంపీపీ పి. సంపూర్ణమ్మ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గొట్టం బ్రహ్మారెడ్డి, మాజీ ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, జేసీఎస్ జిల్లా కన్వీనర్ మోర్తల ఉమ, డీఈ జె. హరిబాబు, ఏఈ మస్తాన్‌వలి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కర్‌రెడ్డి, మండల జేసీఎస్ అధ్యక్షులు పమ్మి సీతారామిరెడ్డి, పార్టీ నేతలు కుందురు పేరెడ్డి, మేకపోతుల కృష్ణారెడ్డి, బూర్రెడ్డి, శివారెడ్డి, శీలం అంజయ్య, రమేష్, పి.పిచ్చిరెడ్డి, జి.భాస్కర్‌రెడ్డి, పి.సీతారామిరెడ్డి తదితరులున్నారు.

ధూళిపాళ్లలో ప్రపంచ ఆరోగ్య సంస్థ పర్యవేక్షక బృందం



సత్తెనపల్లి: ప్రపంచ ఆరోగ్య సంస్థ పర్యవేక్షక బృంద వైద్యుడు డాక్టర్ కోటేశ్వరరావు పల్స్‌పోలియో కార్యక్రమం క్షేత్ర స్థాయి సందర్శనకు పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల గ్రామ పరిధిలో ఉన్న భాగ్యనగర్ కాలనీ, కళ్లం స్పిన్నింగ్ మిల్‌ను మంగళవారం సందర్శించారు. కళ్లం స్పిన్నింగ్ మిల్‌లో పనిచేస్తున్న కార్మికుల గృహాలను సందర్శించి ఐదేళ్లలోపు పిల్లలకు పల్స్‌పోలియో చుక్కలు వేశారా లేదా అనేది పరిశీలించారు. ఆరోగ్య సిబ్బంది రెండవ, మూడవ రోజు గృహాలను సందర్శించి పోలియో చుక్కలను వేయించుకోని పిల్లలను గుర్తించి పోలియో చుక్కలు వేస్తున్నారా లేదా అని, గృహాల మీద మార్కింగ్ చేస్తున్నారా లేదా అనేది పరిశీలించి సంతృప్తి వ్యక్తపరిచారు. కార్యక్రమంలో ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు డాక్టర్ వి.ప్రదీప్, ఆరోగ్య విస్తరణాధికారి పి.శ్రీనివాసరావు, ఆరోగ్య సిబ్బంది సునీత, నటరాజ్, నవీన, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

పరిశోధనలు, అభివృద్ధిపై పెట్టుబడి పెట్టండి

డాక్టర్ సుధాకరరావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ సుధాకరరావు

చేబ్రోలు: విద్యార్థులు పరిశోధనలు, అభివృద్ధిపై పెట్టుబడులు పెట్టాలని యూఎస్ఏలోని డబ్ల్యూఏఎంఎస్ లైట్ ఫెల్లో ప్రెసిడెంట్ అండ్ సీఈఓ డాక్టర్ సుధాకరరావు తెలిపారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో 'రీసెంట్ అడ్వాన్సెస్ ఇన్ ఫండమెంటల్స్, అనాలిసిస్, డిజైన్, ఫ్యాబ్రికేషన్ అండ్ టెస్ట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ యాంటినాస్ ఫర్ స్పేస్, ఏయిర్ అండ్ గ్రౌండ్ అప్లికేషన్స్' అనే అంశంపై అంతర్జాతీయ స్థాయి సదస్సు మంగళవారం నిర్వహించారు. డాక్టర్ సుధాకరరావు మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యనభ్యసించే ప్రతి విద్యార్థికి లెర్నింగ్, అప్‌లైన్, డెవలప్, ఇన్నోవేట్, లీడ్ చేసే ఐదు గుణాలు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. సిస్టమ్స్, హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్, మెకానికల్, టెస్ట్స్ అండ్ కస్టమర్ అండర్‌స్టాడింగ్ వంటి క్రిటికల్ స్కిల్స్‌ను పెంపొందించుకోవాలని కోరారు. అవుట్‌సైడ్ ఆఫ్ ద బాక్స్ ఆలోచించి కాన్సెప్ట్‌లను డెవలప్ చేయాలని చెప్పారు. ప్రాథమిక అంశాలను క్షుణ్ణంగా అర్థం చేసుకుని వాటిని సమస్యలకు అన్వయించి ఫలితాలను రాబట్టాలని వివరించారు. పులివెందుల జేఎన్‌టీయూ వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రమణారెడ్డి మాట్లాడుతూ ఎప్పుడూ ఒకే విధంగా మూస ధోరణిలో పనులు చేసుకుంటూ వెళ్తే కొన్నాళ్లకే విద్యార్థులకు బోరు కొట్టేస్తుందన్నారు. పరిధిని దాటి సులువైన పద్ధతుల కోసం ఆలోచించాలని చెప్పారు. చేసే పనులను కాస్త కొత్తగా, సృజనాత్మకంగా చేయడానికి ప్రయత్నించాలని వివరించారు. జేపీఎల్ సీనియర్ ఇంజినీర్ డాక్టర్ నాసెర్ చహత్, యాంటీనా ఇంజినీర్ డాక్టర్ గౌరాంగి గుప్త, వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్ పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో సీఆర్ జట్టుకు ప్రథమ స్థానం



గణపవరంలో క్రీడాకారులను అభినందిస్తున్న చుండి వేణుగోపాల్, అధ్యాపకులు

నాదెండ్ల: అంతర్ యూనివర్సిటీ సాఫ్ట్‌బాల్ మెన్స్ విభాగంలో గణపవరం చుండి రంగనాయకులు డిగ్రీ కళాశాల జట్టు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ నెల 2,3 తేదీల్లో ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో అంతర్ యూనివర్సిటీ సాఫ్ట్‌బాల్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో పాల్గొన్న సీఆర్ కళాశాల జట్టు వరుసగా తొమ్మిదో సారి విజేతగా నిలిచి రికార్డు నెలకొల్పింది. నరసరావుపేట ఎంఏఎం ఫార్మసీ కళాశాల చైర్మన్ ఎంఆర్ శేషగిరిరావు తల్లిదండ్రుల జ్ఞాపకార్థం నెలకొల్పిన రోలింగ్ ట్రోఫీని వరుసగా రెండోసారి దక్కించుకున్నారు. ఫైనల్ బీకాంకు చెందిన క్రీడాకారులు ఎం ప్రేమ్‌కుమార్, బి సాగర్, ఎ సంజయ్‌బాబు, సంగీత్, ఫైనల్ బీఎస్సీకు చెందిన కె కుమార్ బాబు చక్కటి ప్రతిభతో యూనివర్సిటీ జట్టుకు ఎంపికయ్యారు. కళాశాలలో క్రీడాకారుల అభినందన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చుండి వేణుగోపాల్ మాట్లాడుతూ త్వరలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో రాణించి విజయం సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీహెచ్ చైతన్య, పీడీ నాగేంద్రబాబు, లైబ్రేరియన్ నిరంజన్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రమేష్‌బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వృద్ధురాలిని హతమార్చిన ఇరువురికి యావజ్జీవం

- నాల్గవ ఏడీజే కోర్టు న్యాయమూర్తి తీర్పు

పట్నంబజారు: వృద్ధురాలి హత్య కేసులో ఇద్దరు నిందితులకు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ నాల్గవ ఏడీజే కోర్టు న్యాయమూర్తి మంగళవారం తీర్పు వెల్లడించారు. వివరాల్లోకి వెళితే 2015 సంవత్సరంలో పట్టాభిపురం పోలీసు స్టేషన్ పరిధిలోని బృందావన్ గార్డెన్స్‌లోని సాయిటవర్స్ అపార్టుమెంట్‌లో గార్నెపి సుశీలాదేవి (80) వృద్ధురాలిని హత్య చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసిన పట్టాభిపురం పోలీసులు దర్యాప్తులో భాగంగా ఫిరంగిపురానికి చెందిన కొరివి అశోక్, గేరా రాము అనే ఇద్దరు వ్యక్తులు వృద్ధురాలి మొహంపై దిండుతో ఒత్తి హత్యకు పాల్పడినట్లు గుర్తించారు. కొరివి అశోక్ గార్డెన్స్ సెంటరులోని అపోలో మెడికల్స్‌లో అప్పట్లో సేల్స్ మెన్‌గా వ్యవహరిస్తుండేవాడు. వృద్ధురాలికి మందులు ఇవ్వాలనే నెపంతో ఇంటికి వెళ్లి హతమార్చి సుమారు 400 గ్రాములకుపైగా బంగారం, ఇంట్లో ఉన్న నగదును నిందితుడు అశోక్ తన స్నేహితుడైన రాములును తీసుకెళ్లారు. కేసు విచారణ సమయంలో నిందితులు పరారీ అయిన నేపథ్యంలో ఇరువురిపై మరో కేసు నమోదై ఉంది. దీనికి సంబంధించి నాల్గోవ ఏడీజే కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్ శారదామణి వాదనలు వినిపించి పూర్తి స్థాయిలో నిందితులు నేరం చేసినట్లు రుజువు చేశారు. కోర్టు న్యాయమూర్తి ఆర్.శరత్‌బాబు ఇరువురు నిందితులకు యావజ్జీవ కారాగార శిక్ష విధించడంతోపాటు, జరిమానా విధించారు.